క్లుప్తంగా

అధికారులతో సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ

యాచారం: మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈజీఎస్ పనుల సామాజిక తనిఖీ, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో జరిగే ఈజీఎస్ పనుల సోషల్ ఆడిట్ పట్ల తనిఖీ సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. గ్రామాల్లో ఏ సమస్యలు లేకుండా కృషి చేయాలని, ప్రత్యేకాధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని చెప్పారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిబిరం



కరాటే సాధన చేస్తున్న విద్యార్థులు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తెలంగాణ రైజింగ్ వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుంది. ఇందులో విద్యార్థులు యోగా, కరాటే, వివిధ ఆటలు, నృత్యాలను నేర్చుకుంటున్నారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని గురువారం ఎంఈఓ పాండు, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము సందర్శించారు. శిబిరంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, సీఆర్‌పీలు కిషన్, షేక్ అహ్మద్, పీఈటీలు అజీం, శంకర్ పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

కడ్తాల్: పహల్గాం ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా గురువారం మండల కేంద్రంలో యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం నుంచి భారత ఆర్మీకి మద్దతుగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. భారత సైన్యం ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేస్తూ మెరుపు దాడులు చేసిన తీరును అందరూ హర్షించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్, లాయక్‌అలీ, కృష్ణ, కుమార్, నాగరాజు, వెంకటేశ్, మహేశ్, రమేశ్, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేదల నేతకు నివాళి



నర్సింహ చిత్రపటం వద్ద నివదిస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: పేదల పక్షాన పోరాటం చేసిన వామపక్ష నేత బి.నర్సింహ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం సీపీఎం నేతలు స్మరించుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో నర్సింహ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సామేల్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని కార్మిక, కర్షకుల ఐక్యతకు కృషి చేసిన గొప్ప వ్యక్తి నర్సింహ అని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, బుగ్గరాములు, ఎల్లేశ్, శంకర్, వీరేశం, యాదగిరి, రమేశ్, దాసు, శ్రీకాంత్, మహేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

మొయినాబాద్‌రూరల్: పాడి రైతులు జీవాలకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కాశీంబౌలి, అమ్డాపూర్ గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాతరకు సర్వం సిద్ధం

- ముస్తాబైన స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ నిర్వాహకులు

అబ్దుల్లాపూర్‌మెట్: భక్తుల కొంగుబంగారంగా ఖ్యాతి గడించిన శ్రీ స్వయంభూ స్వర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి 7వ వార్షికోత్సవానికి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ పరిధి గౌరెల్లి గ్రామంలో గుట్టపై కొలువైన స్వామివారి జాతర మహోత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. శాశ్వత అలంకరణ, కోనేరు(గుండం) నిర్మాణం పనులు వంటివి శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ ప్రతి నెలా స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని సుదర్శన హోమం వైభవంగా నిర్వహిస్తారు. ఈ క్రతువును వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులతో పాటు నగరం నుంచి విశేష సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ప్రశాంత వాతావరణంలో ప్రకృతి రమణీయతల నడుమ ప్రతిష్ఠించిన దేవాలయానికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది.

దేవాలయ నేపథ్యమిదే..

వందల ఏళ్ల క్రితం సిద్ధులు ధ్యానం చేయడంతో



పూజలందుకుంటున్న స్వామివారు

గౌరెల్లి గుట్టపై శ్రీ విష్ణుమూర్తి లక్ష్మీనర్సింహస్వామి అవతారంలో స్వయంభూగా వెలిశాడని ప్రసిద్ధి. ఏకశిలపై స్వామివారు ఉత్తరం వైపున కొలువయ్యాడు. ఆలయం దిగువన కోనేరు సహజసిద్ధంగా ఏర్పడింది. చుట్టూ బండరాళ్ల మధ్య ఉన్న ఈ గుండంలో ఏడాది పొడవునా నీటి నిల్వలు ఉంటాయి. లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలోనే పరమ శివుడు కొలువయ్యాడు. దివ్యమైన శివాలయానికి సైతం భక్తులు తండోపతండాలు



ప్రారంభానికి సిద్ధమైన ముఖద్వారం

వస్తుంటారు.

కార్యక్రమాల వివరాలు

స్వర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి వార్షికోత్సవాలకు ఈ నెల 11 ఆదివారం నుంచే అంకురార్పణ చేయనున్నారు. అదేరోజు నిత్య కైంకర్యం, సుదర్శన హోమం ఉంటాయి. 12న సోమవారం అష్టోత్తర శత కలశాభిషేకం, స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేస్తారు. 13న మంగళవారం ఉదయం స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించనున్నారు. జాతరను దృష్టిలో ఉంచుకొని స్థానిక పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తావులేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈసారి ప్రత్యేకం

ఈ ఏడాది జరిగే ఉత్సవాలకు విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రతి నెలా సుదర్శన హోమం సమయంలోనే వివిధ ప్రాంతాల నుంచి జనాల తాకిడి ఉంటుందన్నారు. జాతర వేళ ఆ సంఖ్య మరింత రెట్టింపయ్యే అవశ్యకత లేకపోలేదని పేర్కొన్నారు. అందుకు తగ్గట్లుగానే స్వామివారి దర్శనానికి అంతరాయం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు.



తుది దశకు చేరుకున్న ఆలయ శాశ్వత అలంకరణ పనులు

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు

ఆమనగల్లు: సేంద్రియ వ్యవసాయం రైతులకు లాభదాయకమని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డా.నిర్మల, డా.సుజాతలు అన్నారు. మండలం ఆకుతోటపల్లి రైతువేదికలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించుకోవాలని సూచించారు. అవసరం మేరకు రసాయన ఎరువులను వాడాలన్నారు. ఎరువులు కొనేటప్పుడు విధిగా రసీదులు తీసుకోవాలని చెప్పారు. సాధ్యమైనంతవరకు చెట్లను పెంచాలని, తద్వారా అధిక వర్షాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ అరుణకుమారి, ఏఈఓలు భూదేవి, మీనాక్షి, విశ్వవిద్యాలయం విద్యార్థులు స్వప్న, తరుణ్, ఆయిల్‌ఫాం కో ఆర్డినేటర్ హిమకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ, రైతులు జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

రైతులకు అవగాహన

కడ్తాల్: సుస్థిర పద్ధతుల ద్వారా రైతులు అనేక ప్రయోజనాలు పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అనిత, సుప్రజ్ఞ, విద్యాసాగర్, శిరీషాదీప్తి, సాహితి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' భాగంగా గురువారం మండలంలోని రావిచేడ్, టాక్‌రాజ్‌గూడ తండాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, నాయకులు జితేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ధర్మనాయక్, శ్రీనునాయక్, ఏఈఓలు శ్రీకాంత్‌రెడ్డి, కశ్యప్, అనుషా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి

కడ్తాల్: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని గురువారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ మర్యాద పూర్వకంగా కలిశారు. చల్లంపల్లి, వంపుగూడ గ్రామాల్లోని పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. వంపుగూడలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ, శ్రీశైలం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

రక్తదాన శిబిరానికి స్పందన



ఆమనగల్లులో రక్తదానం చేస్తున్న యువతీ, యువకులు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం, ఆ సంస్థ వ్యవస్థాపకుడు చింతల బాలరాజుగౌడ్ స్మారకార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనికి శృతిలయ కల్చరల్ అకాడమీ, సాయిరాం మెడికల్స్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రి సహకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో 86 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మెడికల్ షాపు అసోసియేషన్ నాయకుడు పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన యువతీ, యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు నితిన్‌గౌడ్, శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు చిత్తరంజన్‌దాస్, సలహాదారులు శంకర్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సభ్యులు శ్రీను, భాస్కర్, లక్ష్మీపతి, మహమూద్, అభినవ్‌రెడ్డి, జంగయ్య, కవిత, శ్రీశైలం, కృష్ణ, ఉదయ్, ఆసుపత్రి సిబ్బంది రామాంజనేయులు, హరికృష్ణ, పీకే.గౌడ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఫరీద్, స్థానికులు శివకుమార్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

పట్టణంలోని శ్రీ సాయి ఆప్టికల్స్ ఆవరణలో గురువారం సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు కొప్ర మల్లేశ్, శ్రావణి ఆధ్వర్యంలో 143 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. ఇందులో కంటి ఆపరేషన్ల కోసం 68 మందిని సికింద్రాబాద్‌కు పంపించారు. కార్యక్రమంలో సిబ్బంది గీత, షబానా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ



మొండిగౌరెల్లిలో దుస్తులు అందజేస్తున్న శివకుమార్‌మంగమ్మ దంపతులు

యాచారం: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొత్తకుర్మ శివకుమార్ కేఎంఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని చింతుల్ల, గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి తదితర గ్రామాల్లోని పంచాయతీ సిబ్బందికి కొత్త దుస్తులను పంపిణీ చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత కోసం పంచాయతీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని, వారి సేవలను గుర్తించి వస్త్రాలు అందజేస్తున్నట్లు శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో కొత్తకుర్మ మంగమ్మ, నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత

చేవెళ్ల: దివ్యాంగుడైన స్నేహితుడికి స్కూటీ అందించి దాతృత్వం చాటుకున్నాడు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి. మున్సిపాలిటీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం నాలుగు చక్రాల స్కూటీని దివ్యాంగుడైన స్నేహితుడు హనుమయ్య దంపతులకు ఆయన అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని నెలల క్రితం చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980–81 బ్యాచ్ విద్యార్థులందరం కలిసి నిర్వహించుకున్న సమ్మేళనంలో తమతో పాటు చదువుకున్న అల్లవాడ గ్రామానికి చెందిన కావలి హనుమయ్య దివ్యాంగుడు కావడంతో అతడికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. అతడి అవసరం గుర్తించి సొంత డబ్బులతో స్కూటీ అందజేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం అతడికి 1లక్ష 30వేల రూపాయలతో కొత్త స్కూటీని కొనుగోలు చేసి తమ పూర్వ విద్యార్థుల సమక్షంలోనేఆలయం వద్ద పూజలు



హనుమయ్యకు స్కూటీని అందిస్తున్న సత్యనారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు

చేయించి హనుమయ్య దంపతులకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవాగుణాన్ని తోటి విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ్‌కుమార్, సంతోష్ గుప్తా, యాదయ్య, ఖాజాపాష, రాములు, శంకరయ్య, ప్రభులింగం, మల్లయ్య, వెంకటయ్య, జనార్దన్, గోపాల్, మాజీ ఎంపీటీసీలు రాములు, చంద్రయ్య, మహేశ్వర్‌రెడ్డి, నాయకులు రాఘవులు, అరుణ్, అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా చేపట్టిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి మండలంలో నిర్వహించనున్నట్లు ఏఓ విద్యాధరి తెలిపారు. ఈనెల 9న పోల్కంపల్లి, 12న ఇబ్రహీంపట్నం, రాయపోల్, 24న ముకునూర్, 26న నాగన్‌పల్లి, తుర్కగూడ, 28న కప్పాపహాడ్, జూన్ 4న దండుమైలారం, జూన్ 6న ఎలిమినేడు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ రంగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకొని తగు సలహాలను, సూచనలు చేయాలన్నారు.

బాధ్యతల స్వీకరణ

యాచారం: మండల ప్రత్యేకాధికారిగా మాధవరావు గురువారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని ప్రజలకు ఇబ్బంది లేకుండా కృషి చేస్తానన్నారు. తాగునీటి, డ్రైనేజీ, ఉపాధి హామీ పథకం, అభివృద్ధి పనులపై శ్రద్ధ చూపుతానని తెలిపారు. అధికారులు ఆయన్ని సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, ఏపీఓ లింగయ్య ఉన్నారు.



ప్రత్యేకాధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మాధవరావు

అర్హులందరికీ ఇళ్లు అందించాలి

సాంస్కృతిక శాఖ జిల్లా కోకన్వీనర్ నరేందర్‌రెడ్డి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందించాలని సాంస్కృతిక శాఖ జిల్లా కోకన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలని కోరుతూ ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని అన్ని పార్టీల నాయకులతో ఇందిరమ్మ కమిటీలు వేస్తామని తెలిపి కాంగ్రెస్ నాయకులతోనే వేశారన్నారు. ఈ కమిటీ కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇళ్లను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి పార్టీలతో సంబంధం లేకుండా అందించాలని ఆయన కోరారు. అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేయకుంటే మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మోటే శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, వీరేందర్‌నాయక్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాజ్యాంగ పరిరక్షణకు కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం చలివేంద్రంపల్లి, రావిర్యాల, గుర్రంపల్లి గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్‌ను జైభీమ్ అంటే బీజేపీ ప్రభుత్వానికి గిట్టదన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజ్యాంగంతోనే సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు గౌరవం దక్కుతుందన్నారు. అంబేడ్కర్, గాంధీ చరిత్రను ప్రజలకు తెలియజేయడానికి గాంధీ ఫొటోలతో, రాజ్యాంగ పుస్తకాలతో ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం భారత సైనికులు పాకిస్థాన్‌పై ప్రదర్శిస్తున్న తీరు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి రాజు, కొందుర్గు మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు తాండ్ర విశాల, పిట్ట రజిత, సత్యానారాయణరెడ్డి, ఆంజనేయులు, రామచంద్రయ్య, భాస్కర్ పాల్గొన్నారు.



రావిర్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వేసవి దుక్కులతో లాభాలు



ఆమనగల్లులో సిద్ధమైన పొలం



పొలంలో చల్లేందుకు పోసిన సహజ ఎరువు

- లోతైన దుక్కులతో అధిక దిగుబడి
- పనుల్లో నిమగ్నమైన రైతులు

ఆమనగల్లు: వేసవికాలంలో పంట విరామ సమయంలో పొలాన్ని లోతుగా దున్నడం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. యాసంగి పంటల తరువాత రైతులు దుక్కులు దున్ని తమ పొలాలను సిద్ధం చేస్తున్నారు. దుక్కులు ఎంత బాగా చేస్తే ఆ ప్రభావం పంట దిగుబడిపై ఉంటుంది. నేలలోని పోషకాలు మొక్కకు బాగా అందుతాయి. తొలకరి వర్షాలు మొదలయ్యేనాటికి లోతైన దుక్కులు చేసుకోవాలి.

దుక్కులు చేసే విధానం

రైతులు పంట సాగుచేసి కోత తరువాత పొలాన్ని వృధాగా ఉంచకుండా లోతుగా అంటే 9 అంగులాల కన్నా ఎక్కువగా ట్రాక్టర్లు లేదా ఎడ్ల నాగళ్లతో దున్నుకోవాలి. లోతుగా దున్నడం వల్ల మట్టి మొత్తం కిందకు కుంగిపోయి లోపలి పొరలోని సూక్ష్మధాతువులు, పోషకాలు పైకి వచ్చి మొక్కలకు అందుతాయి. పొలాలను దుక్కిచేసే ముందు పశువులు, కంపోస్టు ఎరువు వేస్తే భూమికి మరింత సారవంతం అవుతుంది. వేసవి దుక్కులను లోతుగా చేయడం వల్ల అలాగే పంటను నాశనం చేసే కీటకాలు ఎండకు చనిపోతాయి. వర్షాలు కురవడంతో భూమిలో తగినంత తేమ ఉంటుందని వ్యవసాయాధికారులు వివరించారు.

ప్రయోజనాలు ఎన్నో

వేసవి దుక్కుల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. భూసారం మెరుగుపడుతుందని దీనివల్ల తరువాత పంటలు బాగా పండుతాయని చెప్పారు. వేసవి దుక్కులు దున్నడం ద్వారా పంటల దిగుబడి పెరుగుతుందని వివరించారు. దుక్కి చేయడం వల్ల పంటలకు పోటీ లేకుండా మొక్కలు బాగా పెరుగుతాయి. లోతైన దుక్కుల వల్ల పంటలకు వచ్చే చీడపీడల బెడద తగ్గుతుంది.

పొలాల్లోకి ఎరువులు

రైతులు తమ పొలాలలోకి సహజ ఎరువులను తరలిస్తున్నారు. పశు సంపద ద్వారా వచ్చే ఎరువులను పొలాలకు తరలించారు. అలాగే ఇతర సేంద్రియ ఎరువులను చల్లుతున్నారు. నేలకు పోషకాలు చేకూరుతాయని వ్యవసాయాధికారులు వివరించారు.